క్లుప్తంగా

అభివృద్ధి పట్టని పాలకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గ అభివృద్ధిని పాలకులు పూర్తిగా విస్మరించారని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన పనులను చేయడం లేదన్నారు. ఇటీవల పర్యటించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ సైతం ఈప్రాంతంలో నెలకొన్న సమస్యలపై అసహనం వ్యక్తం చేశారన్నారు. గతంలో మంజూరు చేసిన పనులను చేసి చూపాలన్నారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పరమేశ్, పట్టణ అధ్యక్షుడు నగేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వాటర్‌డ్రైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని రోడ్లపై నీళ్లు నిల్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వి.సింధూరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం డివిజన్‌లోని ఎల్‌ఐజీ కాలనీలో జరుగుతున్న వాటర్‌డ్రైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వానలకు రోడ్లపై నీళ్లు నిల్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందులో భాగంగా పలు కాలనీల్లో భూగర్భడ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా వర్షాలు పడే సమయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ దేవేందర్, కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి, డైరెక్టర్లు లక్ష్మణ్, సామ్యూల్, నాయకులు జగన్నాథ రెడ్డి, శేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

జీతాలు పెంచాలంటూ ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: వేతనాలు పెంచాలని ఖేడ్ మున్సిపల్ డ్రైవర్లు, వాటర్‌మెన్లు, ఆపరేటర్లు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తక్కువ వేతనంలో ఏళ్లుగా పనిచేస్తూ రోజు రోజుకు పెరుగుతున్న ధరలతో కుటుంబాలను పోషించుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వేతనాలను పెంచడంతో పాటు జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచి తమపై పనిభారం తగ్గించాలని కోరారు. ధర్నా అనంతరం స్థానిక తహసీల్దార్ షాహీనా బేగంకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. సంఘం డివిజన్ కార్యదర్శి రమేష్, రవి, నాగయ్య, కుమార్, నారాయణ, ఆదాం, తుకారాం పాల్గొన్నారు.

థీమ్స్ పథకానికి ఎంపిక కావాలి: ఎంపీడీఓ శంకర్

హత్నూర(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు ఇచ్చే అవార్డుల కోసం థీమ్స్ పథకంలోని తొమ్మిది కార్యక్రమాలను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శంకర్ అ న్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ పర్వీన్‌షేక్‌తో పాటు ఆయా శాఖల అధికారులతో థీమ్స్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య గ్రామం, తాగు నీరు, క్లీన్ అండ్ గ్రీన్, స్వయం సహాయక బృందాలు 9 అంశాలపై ఈ నెల 31 వరకు గ్రామపంచాయతీల వారీగా అన్ని శాఖల అధికారులు సమాచారాన్ని అందించాలని ఎంపీడీఓ శంకర్ ఆదేశించారు.

గంజాయితో పట్టుబడ్డ హోంగార్డు



రాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు

కంది(సంగారెడ్డి): గంజాయి అమ్ముతున్న ఓ హోంగార్డును శనివారం స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి సంగారెడ్డిలోని కోర్టు వద్ద పని చేస్తున్న హోంగార్డు కొమ్ము రాజు శనివారం రాత్రి కంది సమీపంలో జాతీయ రహదారిపై గల హోటళ్ల వద్ద మరోవ్యక్తితో కలిసి గంజాయిని విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో స్థానికులు పట్టుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు. రాజు వద్ద నుంచి సుమారు 800 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు ప్రారంభించారు.

బురదదారులు.. రాకపోకల ఇక్కట్లు



బురదమయమైన కూరగాయల మార్కెట్ రోడ్డు

చినుకు పడితే చిత్తడిగా రోడ్లు

- కష్టాలు తీర్చాలని కోరుతున్న ప్రజలు

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారి రాకపోకలకు కష్టంగా మారాయి. వర్షానికి రోడ్లు బురదమయమై మోటారు బైక్‌ల టైర్లు మట్టిలో ఇరుక్కుపోయి వాహనదారులు జారి పడిపోతున్నారు. గుంతల్లో సుద్దరకం మొరం మట్టి వల్ల వాహనాలు చిక్కుకుపోతున్నాయి. బురదరోడ్లతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. వానలకు పలు చోట్ల ప్రధాన, అంతర్గత ,మున్సిపాలిటీల రోడ్లు చిత్తడిగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొగుడంపల్లి మండలం మన్నాపూర్–చిరాగ్‌పల్లి రోడ్డును విస్తరిస్తున్నారు. పనుల్లో భాగంగా రోడ్డుపై సుద్దరకం మట్టి వేయడం వల్ల వర్షానికి బురదమయమయ్యాయి. వాహన చోదకులు ఎంతో మంది జారిపడి గాయాలపాలవుతున్నారు. నాణ్యమైన మొరం మట్టి వేయకపోవడంతో బైక్ టైర్లు బురద మట్టిలో ఇరుక్కుపోయి అదుపుతప్పి పడుతున్నారు. కాంట్రాక్టర్ స్పందించి పనులు పూర్తి చేసి బురద కష్టాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కూడా కొద్దిపాటి వర్షానికి చిత్తడిగా మారుతుంది. మరో పక్కా రోడ్డుపై అడుగడునా గుంతలు పడ్డాయి. రాత్రిపూట రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది. ఇప్పటికే చాలా మంది అదుపుతప్పి పడిపోయారు. రోడ్డు మరమ్మతులకు గతంలో నిధులు మంజూరైనా పనులు చేపట్టని కారణంగా రద్దు అయ్యాయి. రోడ్డును బాగు చేసి కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని కూరగాయల మార్కెట్ ప్రాంతంలో గుంతలను పూడ్చడానికి సుద్దరకం మొరం మట్టి వేశారు. వర్షానికి మట్టి బురదగా మారడంతో వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. పస్తాపూర్ జర్నలిస్టు కాలనీలోని రోడ్డు కూడా బురదమయంగా మారింది.సంబంధిత అధికారులు దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.



రోడ్డుపై జారిపడిన ద్విచక్రవాహనదారులు

రోడ్డు పనులు ప్రారంభించాలి



వినతిపత్రం అందజేస్తున్న నారాయణ తదితరులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నుంచి బోనస్‌పూర్ వరకు గల రోడ్డు పనులు ప్రారంభించాలని బీఆర్‌ఎస్ నాయకులు శనివారం ఆర్అండ్‌బీ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ హయాంలో బోనస్‌పూర్ రోడ్డు నిర్మాణానికి రూ.1.36 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు పూర్తి చేయడం లేదని మండిపడ్డారు. శేఖాపూర్ దర్గా ఉత్సవాల సందర్భంగా పది నెలల క్రితం తూతూమంత్రంగా పనులు చేపట్టి వదిలేశాడని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ సర్పంచ్‌లు జగదీశ్, చిన్నారెడ్డి, నాయకులు ప్రేమ్‌బానోత్, ఇస్మాయిల్, మోహిన్ ఉన్నారు.

వరద ఉధృతి పరిశీలన



వాగును పరిశీలిస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండల పరిధిలోని ప్యారవరం వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీఓ మంజుల, ఎస్ఐ నరేశ్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ పరిశీలించారు. ఇరువైపులా స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. వరద ఉధృతి ఉన్న కారణంగా ప్రజలు రాకపోకలు సాగించొద్దని సూచించారు.

ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు ఆలయాలను మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల పండుగ సందర్భంగా పలు ఆలయాల వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు, రోడ్ల మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్కూల్‌పై ఆరోపణలు సరికాదు



ప్రిన్సిపాల్ నిఖిల్

కొండాపూర్(సంగారెడ్డి): రావుస్ పాఠశాలపై కొంత మంది ఏబీవీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు సరికాదని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ నిఖిల్ అన్నారు. ఈ మేరకు శనివారం విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఏబీవీపీ సంఘానికి చెందిన కొంతమంది సభ్యులు రావుస్ స్కూల్, సంగారెడ్డి చట్టబద్ధ అనుమతులు లేకుండా నడుస్తోందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమైనవని, పాఠశాల ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశంతోనే ఇలాంటి గందరగోళానికి తెరలేపుతున్నారని తెలిపారు.స్కూల్‌కి అవసరమైన అన్ని అధికార అనుమతులు, గుర్తింపులు విద్యాశాఖ నుంచి చట్టబద్ధంగా ఉన్నాయని తెలిపారు. విద్యాశాఖ అనుమతితోనే సంబంధిత నిబంధనలకు అనుగుణంగా పాఠశాలను నడుపుతున్నామన్నారు. ఈ తప్పుడు ఆరోపణల వల్ల తల్లిదండ్రుల్లో ఆందోళన కలుగుతోందని, ఎవరూ ఇలాంటి ప్రచారాన్ని నమ్మవద్దని చెప్పారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీస్తున్న దశరథ్

కమిషనర్ పర్యటన

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ దశరథ్ పర్యటించారు. శనివారం పట్టణ కేంద్రంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. నివాసాల మధ్య చెత్తచెదారాలు వేయకుండా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. పరిశుభ్రతలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నేరాల నియంత్రణకు చర్యలు



వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని నేరాల నియంత్రణకు పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శనివారం మండలంలోని ప్రధాన రహదారిపై వాహనదారుల నుంచి వేలిముద్రలు తీసుకున్నారు. పాత కేసులు, కొత్త వ్యక్తుల వివరాలు గుర్తించేందుకు ఈ తనిఖీలు దోహదపడతాయన్నారు.

అసత్య ప్రచారం చేస్తే చర్యలు తప్పవు

తహసీల్దార్ ఫర్హిన్ షేక్

హత్నూర(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ట్లు తహసీల్దార్ ఫర్హిన్ షేక్ తెలిపారు. శని వారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతుల భూసమస్యల పరిష్కారం చేయాలనే లక్ష్యంతో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. రికార్డుల్లో పొరపాట్లు దొర్లి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో సుమారు 20 రోజుల పాటు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై విచారణ చేస్తున్నామన్నారు. వ్యవసాయతర భూములకు ఆన్‌లైన్‌లో జరిగిన తప్పిదాల వల్ల రైతు భరోసా వచ్చినట్లు గుర్తించారు. వాటిని వెంటనే నిలిపివేయించి.. తప్పిదాలను సరి చేసినట్లు స్పష్టం చేశారు. కొందరు భూభారతి చట్టంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారిపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రతిభతోనే బంగారు పతకం

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన మలమంచి శిల్ప నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయంలో బీఎడ్‌లో ప్రతిభ చూపి బంగారు పతకాన్ని సాధించడం అభినందనీయమని ఎమ్మెల్యే సంజీవ రెడ్డి సతీమణి అనుపమారెడ్డి అన్నారు. శనివారం శిల్పను ఆమె శాలువాతో సన్మానించి అభినందిస్తూ విద్య అనేది బాధ్యతలతో సంబంధం లేకుండా ఆసక్తి ఉంటే ఏవయసులోనైనా విజయం సాధించవచ్చని శిల్ప మరోసారి రుజువుచేసిందన్నారు. ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ కోశాధికారిణి లావణ్య, ట్రైనింగ్ డైరెక్టరు బాలమణి, శ్వేతతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

◆ 40 మందికి కంటి శస్త్ర చికిత్సలు

నారాయణఖేడ్: నియోజకవర్గానికి చెందిన 40 మందికి సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశారు. హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 76 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఖేడ్ సత్యసాయి ఆలయంలో గురువారం వారిలో 40 మందికి కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వారిని అదేరోజు ఉచిత వాహన సదుపాయాన్ని ఏర్పాటు చేసి ఆస్పత్రికి తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేయించారు. శనివారం వారిని ఖేడ్‌కు తీసుకువచ్చారు. ప్రతీనెల 3వ గురువారం ఖేడ్ సత్యసాయి మందిరంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా కన్వీనర్ శంకరప్ప కోరారు.

◆ సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



నారాయణఖేడ్: సీఎం సహాయనిధి ద్వారా ఆస్పత్రి ఖర్చుల కోసం ఖేడ్ మండలం హన్మంతరావుపేటకు చెందిన ముత్యాల లక్ష్మికి రూ.18 వేలు, అనంతమ్మకు రూ.32 వేలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కులను శనివారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఖేడ్‌లోని తన నివాసగృహంలో అందజేశారు. మాజీఎంపీటీసీ నారాయణ, నాయకులు రమేష్ చౌహాన్, శంకర్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సుమారు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కులను ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ అందజేశారు. అలాగే, నిజాంపేట మండలం నాగ్ధర్‌కు చెందిన శాలిని రూ.24 వేలు, నిజాంపేటకు చెందిన సావిత్రికి రూ.10,500, మల్లయ్యకు రూ.12 వేలు, సాయిలుకు రూ.10,500 ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరుకాగా అందుకు సంబంధించిన చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అందజేశారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీ షెట్కార్, గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: సెట్విన్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సెట్విన్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెట్విన్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు స్వయం ఉపాధితో చాలా మంది నిలదొక్కుకున్నారన్నారు. సంస్థలో శిక్షణ పొందే అభ్యర్థులకు ఉజ్వల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25శాతం ఫీజు చెల్లించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్, ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్, ఆర్డీఓ రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు, ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు సత్తాచాటాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. ఖేడ్ సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో శనివారం నియోజకవర్గ స్థాయి యువజన కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముఖ్యపాత్ర పోషించారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యాంచరణ్ రెడ్డి, సహాయ కార్యదర్శి నాగార్జున, జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు సిద్ధారెడ్డి, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

సొంత భవనాలు నిర్మించుకోలేని ప్రభుత్వం

బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించుకోలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని బీజేపీ పటాన్‌చెరు మండల అధ్యక్షుడు వీరేశం ఆరోపించారు. శనివారం బీజేపీ నాయకులు ఇంద్రేశంలోని గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో గురుకుల పాఠశాలలను పట్టించుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే మార్గంలో వెళ్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి సొంత గురుకుల హాస్టళ్లను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా సెక్రటరీ శేఖర్, ఓబీసీ మండల అధ్యక్షుడు రవీందర్, పటాన్‌చెరు మండల ఉపాధ్యక్షుడు నాగరాజ్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల రికార్డు



బిడ్డను పరిశీలిస్తున్న ఆశావర్కర్

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాల రికార్డు కొనసాగుతోంది. ఒక రోజుకు నాలుగైదు ప్రసవాలు జరుగుతున్నాయి. శనివారం మూడు సాధారణ ప్రసవాలు జరిగాయి. ముర్తుజాపూర్‌కు చెందిన శ్రీలత, డప్పూర్‌కు చెందిన శబానా నాజ్మీన్, మహెబూబీలకు సాధారణ ప్రసవాలు జరిగాయి. మరో ఇద్దరికి సాధారణ ప్రసవాలు జరగకపోవడంతో వారిని జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారికి సీజరిన్ జరినట్లు వైద్యులు అమృత్‌రాజ్ తెలిపారు. తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు.



మాక్ పోలింగ్‌లో విద్యార్థులు, టీచర్లు

ఆకట్టుకున్న మాక్ పోలింగ్

జహీరాబాద్ టౌన్: మండల కేంద్రం మొగుడంపల్లి గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులు మాక్ పోలింగ్(నమోనా ఎన్నికలు) విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు ఎన్నికల్లో పోటీదారులుగా.. ఓటర్లుగా.. ఎన్నికల సిబ్బందిగా, పోలీసులుగా వ్యవహరించారు. దీంతో గురుకులంలో మాక్ పోలింగ్ సందడి నెలకొంది. విద్యార్థులకు ఎన్నికల విధానంపై ప్రత్యేక్షంగా అవగాహన కల్పించేందుకు నమోనా ఎలక్షన్ నిర్వహించామని ప్రిన్సిపాల్ హిమబిందు తెలిపారు.

వర్షానికి దెబ్బతిన్న పత్తిపంట



వరదధాటికి దెబ్బతిన్న పత్తిపంట

వట్‌పల్లి(అందోల్): మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఆయా గ్రామాల్లో భారీ వర్షానికి పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. మండలంలోని కేరూర్, బిజిలీపూర్ గ్రామాల మధ్య ఉన్న వాగు పొంగిపొర్లడంతో పక్కనే ఉన్న పంట పొలాలపై నుంచి వరద ప్రవహించింది. దీంతో మండలంలో పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. అయినా అధికారులు మాత్రం గ్రామాల వైపు కన్నెత్తి చూడలేదు. మండలంలో నాలుగు క్లస్టర్ల పరిధిలోని ఏఈఓలు ఉండగా ఒకరు మాత్రమే పంటలను పరిశీలించారు. తప్ప మిగతా ఏఈఓలు ఎవరూ గ్రామాలకు వెళ్లి పంటలను పరిశీలించలేదని ఆయా గ్రామాల రైతుల ఆరోపించారు. దీనిపై మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా కేరూర్ గ్రామంలో పత్తి పంట దెబ్బతిన్నట్లు మాత్రమే తమకు దృష్టికి వచ్చినట్లు చెప్పారు.

ప్రొటోకాల్ పాటించకపోవడంపై రగడ



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్: సెట్విన్ సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఫొటోను వేయకపోవడంపై బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం సెట్విన్ కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ఎమ్మెల్యే ఫొటో వేయలేదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలిపి, అనంతరం ఆర్డీఓ రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, పాక్స్ చైర్మన్ మచ్చేందర్, సీనియర్ నాయకులు నామ రవికిరణ్, శివప్ప, హీరూరాథోడ్, రవికిరణ్, జగదీశ్, విజయ్, వహీద్, నర్సింహారెడ్డి, వెంకట్, చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్



విలేకరులతో మాట్లాడుతున్న సురేశ్

జహీరాబాద్ టౌన్: పెండింగ్ స్కాలర్‌షిప్ ఫీజుల బకాయిలు, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం చేయాలని ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల బంద్‌కు పిలుపు నివ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేనందున విద్యాప్రమాణాలు పడిపోతున్నాయని, ఎంఈఓ, డీఈఓ, టీచర్ పోస్టుల ఖాళీలు భర్తీకావడం లేదన్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బంద్‌లో భాగస్వామ్యులు కావాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్, పలు సంఘాల నాయకులు నరేందర్, ఆకాష్, అలీ, పవన్ పాల్గొన్నారు.